క్లుప్తంగా

పాలకోడేరు ఎస్సైగా రవివర్మ బాధ్యతల స్వీకరణ


పాలకోడేరు ఎస్సై రవివర్మ

పాలకోడేరు: పాలకోడేరు మండల పోలీస్ స్టేషన్ ఎస్సైగా రవివర్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కోనసీమ జిల్లా అంతర్వేది మెరైన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో ఉండి, కాళ్ల ఎస్సైగా పనిచేశారు. ఇప్పటివరకు పనిచేసిన ఎస్సై ఎన్ హరిబాబు హెడ్ క్వార్టర్‌కి వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై రవివర్మను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

ఈవోపీఆర్డీగా వెంకటరెడ్డి బాధ్యతల స్వీకరణ


ఈవోపీఆర్డీని అభినందిస్తున్న ఎంపీడీవో రవీంద్ర, పంచాయతీ కార్యదర్శులు

ఉండి: ఉండి మండల నూతన ఈవోపీఆర్డీగా వెంకటరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని పెనుమంట్ర మండల ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఉండికి వచ్చారు. ఇదే స్థానంలో పనిచేసిన రామకృష్ణారెడ్డి అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం ఈవోపీఆర్డీగా బదిలీపై వెళ్లారు.ఈ సందర్భంగా ఎంపీడీవో ఎస్ రవీంద్ర, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి యువజన కూడికలు

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చ్ యూత్ (టీఎల్‌వై) ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6:30 గంటల నుంచి 12వ తేదీ వరకు ఉండి 26వ యువజన శాంతి సహవాస కూడికలు నిర్వహిస్తున్నట్లు యూత్ ప్రతినిధులు తెలిపారు.ఈ సభలకు వాక్యోపదేశకులుగా బ్రదర్ జాన్‌వెస్లీ(గుండుగొలను), బ్రదర్ గ్రేస్ విక్టర్ (పాలచర్ల), బ్రదర్ జాన్ మంగాచార్యులు (పెదలంక) నుంచి వస్తున్నట్లు తెలిపారు. సభాధ్యక్షుడిగా పేరిష్ పాస్టర్లు రైట్ రెవరెండ్ డీ మేష్‌క్ సతీష్‌కుమార్, రెవరెండ్ ఎస్ఏజే అబ్షాలోమ్‌రాజు వ్యవహరిస్తారని, సభలను స్థానిక సీఆర్ పీ కరుణాకర్ ప్రారంభిస్తారని వారు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: ఉండికి చెందిన మహిళ అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి శివారు నక్కరాజుగుంట ప్రాంతానికి చెందిన నీతిపూడి సుమిధ వివాహానంతరం భర్త, బిడ్డలతో కలిసి ఎన్నార్పీ అగ్రహారంలో నివాసముంటున్నారు. వారం రోజుల క్రితం పుట్టినింటికి నక్కరాజుగుంట వచ్చిన ఆమె అక్కడే ఉంటోంది. ఈ నెల 8వ తేదీ మంగళవారం రాత్రి భోజనం చేసిన అనంతరం కుటుంబీకులతో కలిసి ఆమె నిద్రపోయింది. అదే రోజు అర్ధరాత్రి 2 గంటల సమయంలో తండ్రి లేచి చూసేసరికి ఆమె కనిపించకపోవడంతో చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద గాలించినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి బలే సుందర్రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ యేసయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ భవనాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

భీమవరం: నిండ్రకొలను మండలం పెదనిండ్రకొలను గ్రామంలోని గాంధీస్మారక మందిరాన్ని పర్యాటక ప్రదేశంగా ప్రభుత్వం అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, సంయుక్తకార్యదర్శి సాగిరాజు జానకీరామరాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గాంధీ భవనం 10 ఏళ్ల క్రితం మూతపడడంతో అనేక అక్రమణలు జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో జిల్లా సర్వోదయ మండలం ప్రయత్నంతో గాంధీభవనం తిరిగి తెరిపించి కొన్ని మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన గాంధీభవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఎంఆర్‌ఓ ఫీడర్, మత్స్యపురి ఫీడర్ మరమ్మత్తులు కారణంగా గురువారం రేపు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకటేశ్వరరావు బుధవారంఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా వీరవాసరం, మత్స్యపురి, భీమవరం, తాడేరు, జీబీఎస్, ఎంఆర్‌ఓ, ఏపీ టిట్కో ఫీడర్స్‌లో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అందువల్ల వీరవాసరం మండలం, భీమవరం రూరల్ మండలంలోని ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని వెంకటేశ్వరరావు కోరారు.

అందని వరద నష్ట పరిహారం

- భారీ వర్షాలకు మూల లంక రైతుకు తీవ్రనష్టం
- కూటమి ప్రభుత్వం ఆదుకోవాలంటున్న అన్నదాతలు
- వైఎస్ జగన్ పాలనలో సక్రమంగా అందిన పథకాలు


ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన మాదివాడ ఆయకట్టు


మూలలంక పొలంలో వరదలకు పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న రైతు

ఆకివీడు: వరద ముంపు బెడద రైతులను ఇంకా పట్టి పీడిస్తూనే ఉంది. పంట నష్టపోవడమే కాకుండా వరి చేలల్లో భారీగా తూడు, గడ్డిజాతి మొక్క పెరిగిపోయాయి. వరి మొక్కలు కుళ్లిపోయాయి. చేలల్లో నాలుగు అడుగుల మేర వరద నీరు నేటికీ తిష్టవేసి ఉంది. ముంపునీరు బయటకు పోవడం కష్టంగా ఉండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. స్థానిక మూలలంక, మాదివాడ లంక ప్రాంతాల్లోని వరి చేలల్లో భారీగా ముంపునీరు నిలిచే ఉంది. పొలాల్లో పేరుకుపోయిన గడ్డిజాతి మొక్కల్ని తొలగించడం కష్టతరంగా ఉందని రైతులు వాపోతున్నారు. పలు చోట్ల తామర మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. మూలలంక ఆయకట్టులో 75 ఎకరాలు, మాదివాడ లంక ప్రాంతంలో 80 ఎకరాల వరి భూమి ఉంది. ఇదే పరిస్థితి మండలంలోని చినమిల్లిపాడు, సిద్ధాపురం, దుంపగడప, కాళింగగూడెం, చినకాపవరం, పెదకాపవరం, తరటావ, కోళ్లపర్రు, మందపాడు, అయిభీమవరం, చెరుకుమిల్లి గ్రామాల్లో ఉంది.

ముంపు పరిహారం ఇప్పించండి

స్థానిక మూలలంక ప్రాంతంలోని 75 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేసిన రైతులకు ముంపు పరిహారం అందజేయాలని ఆ ప్రాంత రైతులు కోరుతున్నారు. నష్టపరిహారంగా రూ.10 వేలు నేటికీ తమకు జమ కాలేదంటున్నారు. నష్టపరిహారం అందకపోతే, బీమా సొమ్ము జమ అయ్యే అవకాశం ఉండదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేలల్లో పేరుకుపోయిన గడ్డిజాతి మొక్కల తొలగింపునకు ఎకరాకు రూ.15 వేలకు పైగా ఖర్చయ్యే అవకాశం ఉందని, కూలీలెవ్వరూ పనులకు రావడంలేదని రైతులు వాపోతున్నారు. జగన్ ప్రభుత్వంలో తమకు పంట నష్టపరిహారం, బీమా సొమ్ము చెల్లించారని, రైతు భరోసా కూడా రూ.13,500 అందుకున్నట్టు రైతులు తెలిపారు.

నవంబర్ 15కి దాళ్వా నారుమడులు

మండలంలోని పలు గ్రామాల్లో నవంబర్ 15 నాటికి దాళ్వా నారుమడులు వేసుకునే అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. చేలల్లో ఉన్న ముంపునీరు బయటకు పోయేందుకు నెల రోజులు పట్టే అవకాశం ఉందని వారంటున్నారు. వాతావరణం సహకరిస్తే దాళ్వా నాట్లు డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తవుతుందని చెబుతున్నారు.

ముంపు బాధిత రైతులను ఆదుకోవాలి



ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు ఖరీఫ్ పంట నీట మునిగింది. నా కూతురు, నా పొలం కలిపి ఏడు ఎకరాలు సాగు చేశాము. ప్రస్తుతం 4 అడుగుల ముంపు నీటిలోనే వరి చేలున్నాయి. చేలల్లో తూడు, గడ్డి,తామర మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. తొలగించేందుకు కూలీలు పనులకు రావడం లేదు. ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం మాకు అందలేదు. రైతు భరోసా మంజూరు కాలేదు. జగన్ ప్రభుత్వంలో రైతు భరోసా, పంట నష్టం, బీమా అందాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

–రంభ అప్పారావు, రైతు, మూలలంక, ఆకివీడు

కాళ్లకూరు సచివాలయం ప్రారంభం

కాళ్ల: కాళ్లకూరులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, హెల్త్ సెంటర్ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ సాదు శ్రీదేవి, ఉపసర్పంచ్ నడింపల్లి ప్రదీప్ రాజు, జుత్తిగ నాగరాజు, జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు, కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సునీల్, డాక్టర్ నీలాద్రిరాజు, సాధు శ్రీనివాస్, అడ్డాల నాగరాజు, తహసీల్దార్ సుందర్ సింగ్, ఎంపీడీవో స్వాతి, పంచాయతీ కార్యదర్శి సునీల్, అధికారులు పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సులపై దృష్టి సారించాలి

ఉండి: వృత్తి విద్యాకోర్సులపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అన్నారు.బుధవారం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఐఎంసీ చైర్మన్ బాలకృష్ణంరాజు ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సెల్‌ఫోన్, ఆక్వా మోటార్లు, ఏరియేటర్ల మరమ్మతు పనులు నేర్చుకుంటే మంచి ఆదాయం సంపాదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరాజు, ఆరేటి ప్రకాష్ పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం

సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


కాళ్ల: విద్యాలక్ష్మి అలంకరణలో శ్రీ లక్ష్మీ


ఉండి: సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ


ఆకివీడు: దుంపగడపలో సరస్వతీదేవి పూజలు చేస్తున్న చిన్నారులు


భీమవరం(ప్రకాశం చౌక్): నాచువారి సెంటర్‌లో సామూహిక కుంకుమ పూజ


భీమవరం: యనమదుర్రు రజకులవారి వీధి రామాలయంవద్ద అక్షరాభ్యాస కార్యక్రమం

ఆకివీడు: చదువుల తల్లి సరస్వతీ విద్యా బుద్ధులు ప్రసాదించమ్మా అంటూ బుధవారం దుర్గమ్మకు చిన్నారులు పూజలు చేశారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం బుధవారం అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించారు. అమ్మవారి ప్రధాన దేవాలయాల్లోనూ, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దేవీశరన్నవరాత్రి ఉత్సవ మండపాల్లో చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. స్థానిక గ్రామ దేవత పెద్దింటి అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. వనువులమ్మ, రాజరాజేశ్వరి, దానేశ్వరి, మారమ్మ, గంగానమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు.

విద్యాలక్ష్మి అలంకరణలో..

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలో స్వయంభూఃవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీలక్ష్మీ శరన్నవరాత్రి మహోత్సవల్లో భాగంగా 7వ రోజు అమ్మవారు విద్యాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఉదయం శ్రీ చక్ర అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని స్వామి వారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి.అరుణ్ కుమార్ తెలిపారు.

చదువుల తల్లి సరస్వతీదేవిగా దుర్గమ్మ

ఉండి: చదువుల తల్లి సరస్వతీ దేవి అవతారంలో దుర్గమ్మ బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా భక్తులు, విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండల వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

వైభవంగా సరస్వతీదేవి పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రులలో భాగంగా బుధవారం ఉదయం మూలనక్షత్రం శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని సరస్వతి దేవి అలంకారం నిర్వహించారు. బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జునశర్మ సరస్వతి దేవి అలంకరణ పూజ నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక సరస్వదేవి పూజ నిర్వహించగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు. చిన్నారులతో ఆలయ ప్రధాన అర్చకులు చిన్ని సరస్వతి పూజ చేయించారు. అనంతరం విద్యార్థులు అందరికి వేమన శతకం, పెన్నులు, పుస్తకం ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ అందజేశారు. స్థానిక నాచువారి సెంటర్‌లో శ్రీకనదుర్గ అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద సామూహిక కుంకమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్ని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఫణి, ఉత్సవ నిర్వహికులు, దాతలు పాల్గొన్నారు. అలాగే మెంటేవారి తోట శ్రీబాలత్రిపుర సుందరిదేవి ఆలయంలో దేవినవరాత్రి మహోత్సవాల్లో బుధవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మూల నక్షత్రం సందర్భంగా భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 108 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు. అలాగే అమ్మవారికి గాదిరాజు శ్రీహరి రాజు, లావణ్య దంపతులచే అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

యనమదుర్రులో

భీమవరం: మండలంలోని యనమదుర్రు గ్రామంలోని రజకుల వారి వీధి రామాలయం వద్ద నిర్వహిస్తున్న దుర్గాదేవి శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా బుధవారం చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. మూల నక్షత్రం కావడంతో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి వేదపండితుడు వేలూరి శ్రీధరశర్మ చిన్నారులతో తొలి అక్షరం దిద్దించారు. ఈ కార్యక్రమానికి చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెల్లా శ్రీబాలబాలాజీ, అంబికా దంపతులు, గుబ్బల వెంకటేష్, కడలి ధర్మారావు, బొక్కా శక్తీశ్వరరావు, బొక్కా లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వీరవాసరం మండలంలో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వీరవాసరంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, తోలేరులోని శ్రీ ప్రసన్న కనకదుర్గాదేవి ఆలయం, రాయకుదురు, మడుగు పోలవరం, నవుదూరు, అండలూరు తోకలపూడి, మత్స్యపురి, నందమూరి గరువు, చింతల కోటి గరువు, పెరికిపాలెం, దూషన పూడి, మత్స్యపురి పాలెం తదితర గ్రామాల్లో శ్రీ అమ్మవార్ల నవరాత్రి మహోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. అమ్మవార్లకు కలశస్థాపన కుంకుమ పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని భక్తులు తెల్లవారుజాము నుంచి అమ్మవార్ల ఆలయంలో దర్శనాలు చేసుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

భీమవరం సుందరీకరణకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం సుందరీకరణకు మున్సిపల్ అధికారులు నిరంతర కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, భీమవరం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశం నందు జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు భీమవరం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి భీమవరం మున్సిపల్ కమిషనర్, వివిధ విభాగాల అధికారులు, ఇంజనీర్లతో సమావేశమై భీమవరం సుందరీకరణపై సుదీర్ఘంగా సమీక్షించారు. తొలుత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆహ్లాదకరమైన కట్టడాలు, లైటింగ్, సెల్ఫీ పాయింట్, వాల్ పెయింటింగ్స్, మ్యూజిక్ ఫౌంటెన్లు, స్మార్ట్ ఫోన్స్, పార్కులు, జంక్షన్లు అభివృద్ధి, హ్యాపీ స్ట్రీట్ తదితర ఏర్పాట్లకు ప్రాంతాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. అలాగే మున్సిపల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్లు వెంటనే విశాఖపట్నం వెళ్లి అక్కడ లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించి అవగాహన చేసుకోవాలని సూచించారు. ప్రకాశం చౌక్ లో ఏర్పాటుచేసిన వాటర్ ఫౌంటెన్‌ను వెంటనే వినియోగం లోకి తీసుకురావాలన్నారు. బడ్జెట్ గురించి ఆలోచన చేయవద్దని భీమవరాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వాణిజ్య సముదాయాల ముందు ఎట్టి పరిస్థితుల్లో చెత్తను వేయడానికి వీలులేదని, అక్టోబర్ 15 నాటి నుంచి అమలయ్యేలా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఎవరైనా చెత్తను వేస్తే పది వేల రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు


ధాన్యం కొనుగోలుపై సూచనలు, సలహాలిస్తున్న ఆర్డీఓ కె.ప్రవీణకుమార్ రెడ్డి

ఆకివీడు: ఖరీఫ్ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు మిల్లుల వద్ద ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపైన, అధికారులపైనా ఉందని భీమవరం ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి చెప్పారు. స్థానిక మహిళా సమాఖ్య ప్రాంగణంలో బుధవారం ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీఓ మాట్లాడుతూ సాంకేతిక లోపాలు రాకుండా సిబ్బంది అప్రమత్తతో ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమయ్యే వాహనాల్ని వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ధాన్యం నాణ్యత, ప్రమాణాల్ని సక్రంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక, ఏడీఏ కె.శ్రీనివాస్‌రావు,

తపాలా శాఖ వారోత్సవాలు ప్రారంభం


భీమవరం హెడ్‌పోస్టాఫీసులో తపాలాశాఖ వారోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: తపాలా శాఖలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భీమవరం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్‌వీ సత్యనారాయణరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, తపాల శాఖ సంయుక్త అధ్వర్యంలో నిర్వహిస్తున్న తపాలా శాఖ వారోత్సవాలను భీమవరం హెడ్ పోస్టల్ కార్యాలయంలో బుధవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ అల్లు సురేష్, హెడ్ పోస్ట్ మాస్టర్ పి.రాజు, పీఆర్‌వో సత్యనారాయణ మాట్లాడుతూ పోస్టల్‌శాఖ ద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధి కలిగి ఉన్నారని పోస్టల్ సంక్షేమ పథకాలు, ఇన్సూరెన్స్‌లపై అవగాహన అవగాహన అవసరమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 16 వరకు పోస్టల్ శాఖ సహకారంతో వారోత్సవాల్లో స్టాంపుల ప్రదర్శన, విద్యార్థులకు వివిధ పోటీలు, మొక్కలు నాటడం, పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తామని, విజేతలకు ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామని, ఉత్తమ పోస్ట్‌మేన్‌లకు సత్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రమణ్యం, చెల్లబోయిన రంగారావు, ఎస్‌కే చాన్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో రహదారులు జలమయం


ఆకివీడు ప్రధాన సెంటర్‌లో జలమయమైన రోడ్డు


పెదపేటలోని ఇళ్లను ముంచెత్తిన వర్షపు నీరు

ఆకివీడు: కురిస్తే కుండ పోత వర్షం, లేకుంటే అగ్ని గుండం అన్న చందంగా వాతావరణం ఉంది. వేసవిని తలపిస్తూ పగటి పూట ఎండలు మండిపోతున్నాయి. అదే సమయంలో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాయంత్రం వేళ ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా కుండపోత వర్షం కురుస్తోంది. ఈ విచిత్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రజలు జ్వరాలు, దగ్గు, జలుబు వంటి వ్యాధుల బారినపడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం వరకూ ఆకివీడులో ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోయారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో వాతావరణం మేఘావృత్తమై, కుండపోత వర్షం కురిసింది. గంట వ్యవధిలో కురిసిన వర్షానికి రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయిన్లు, రోడ్లన్నీ వర్షపు నీటిలో మునిగిపోయాయి. నగర పంచాయతీ పరిధిలోని ప్రధాన సెంటర్‌కు కూతవేటు దూరంలోని పెదపేటలోని పలు ఇళ్లు జలమయమయ్యాయి. సాలిపేట, సంతపేట, జవహర్‌నగర్, మాదివాడ తదితర ప్రాంతాల్ని కుండపోత వర్షం ముంచెత్తింది. జాతీయ రహదారి స్థానిక ప్రధాన సెంటర్ నుంచి అర కిలోమీటరు మేర నీట మునిగింది. చేలల్లోకి మరింత ముంపు నీరు ప్రవేశించడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.


స్థానిక ఎస్ టర్నింగ్ వద్ద కుండపోత వర్షానికి మునిగిన రోడ్డు

నేడు నాలుగు పోస్టాఫీసుల్లో ఆధార్ క్యాంపులు

భీమవరం: జాతీయ పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా భీమవరం పోస్టల్ డివిజన్ పరిధిలోని తాడేరు, దగ్గులూరు, రేలంగి, తేతలి గ్రామాల్లో ఈనెల 10వ తేదీన ఆధార్ క్యాంపులు ఏర్పాటుచేస్తున్నట్లు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ ఎస్‌వీ సత్యనారాయణరాజు తెలిపారు. ఈ క్యాంపులో సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని సత్యనారాయణరాజు కోరారు.

ఉచిత ఇసుకపై ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి


ఉండి సెంటర్‌లో గృహనిర్మాణ సామగ్రితో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఉండి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 5 యూనిట్ల ఇసుక ధర సుమారు రూ.15 వేలు ఉండగా, కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక పేరు చెప్పి 5 యూనిట్ల ఇసుకను రూ.30 వేలకు విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవారం ఉండి మెయిన్ సెంటర్‌లో సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గృహనిర్మాణ కార్మికులు పనిముట్లు చేతపట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఇసుక పుష్కలంగా లభించే గోదావరి జిల్లాలో కొరత కారణంగా సుమారు లక్ష మంది భవన నిర్మాణ కార్మికుల ఉపాధికి గండి పడిందని అన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఇసుక అధిక ధరలు పలుకడంతో ఇంటి నిర్మాణాలు చేపట్టే వారు కరువయ్యారని అన్నారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీయం నాయకులు కొట్టాడ వెంకటేశ్వరరావు, కింతాడ రమేష్, ఆళ్ల గొల్లబ్బాయి, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.